

ప్రాచీన కళకు ప్రాణం 8లో▸

చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల కళాకారులు చిరుతల రామాయణం రక్షణకు శ్రీకారం చుట్టారు. వివిధ పాత్రలు పోషించేందుకు శిక్షణ పొందుతున్నారు.



బాసరలో భక్తుల రద్దీ 8లో▸

నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

గరిష్ఠం/కనిష్ఠం 34.5/18.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత, అధికంగా ఉంటుంది. రాత్రి తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

యూజీసీ నెట్‌కు ఎంపిక



రమాతాయి

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కళాశాలలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థిని ముండే రమాతాయి జేఆర్‌ఎఫ్ చరిత్ర సబ్జెక్ట్‌లో యూజీసీ నెట్‌కు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘు తెలిపారు. ప్రస్తుతం ఆమె సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. యూజీసీ నెట్‌కు ఎంపిక కావడంపై కళాశాల లెక్చరర్లు యాకూబ్ అలీ, పృథ్వీరాజ్, సోని, తదితరులు అభినందించారు.

నేడు మంచిర్యాలకు సీఎం

సాక్షి ప్రతినిధి మంచిర్యాల: ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మంచిర్యాలకు రానున్నారు. ఉదయం 11 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలిక్యాప్టర్‌లో బయలు దేరుతారు. 11.45 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుని అక్కడ 11.50 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి 2.15 గంటలకు మంచిర్యాలకు వచ్చి 2.20 నుంచి 3.55 వరకు సభకు హాజరవుతారు. సీఎంతోపాటు మంత్రులు, రాష్ట్రస్థాయి నాయకులు సభకు హాజరుకానున్నారు. ఈ సభకు 12వేల పట్టభద్రులను తరలించేలా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు సమీప ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పట్టభద్రులను సభకు రప్పించే ఏర్పాటు చేశారు. సీఎం సభ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతోపాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. డీసీపీ ఎ.భాస్కర్ నేతృత్వంలో సభాస్థలి, పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి సీఆర్టీల మద్దతు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లా గిరిజన సీఆర్టీ ఉపాధ్యాయులు ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే భారీగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. గత పాలకులు ఉద్యోగులను పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదన్నారు. అనంతరం సీఆర్టీ ఉద్యోగులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామబాద్ జిల్లాల పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, వంశీ, కమలాకర్, శ్రీనివాస్, సుంగు, శంకర్, విజేశ్, మునినాయక్, తదితరులు పాల్గొన్నారు.

'యాదవులు ఐక్యతతో ముందుకెళ్లాలి'


ఆదిలాబాద్‌రూరల్: యాదవులు ఐక్యతతో ముందుకెళ్తూ రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారామ్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, సినీ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్‌తో కలిసి హాజరయ్యారు. నూతన కార్యవర్గం జిల్లా యాదవ సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అసుర హన్మాండ్లు, మంచాల మల్లయ్య, గౌరవ అధ్యక్షుడు గొర్ల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్యుడు సేవాలాల్



బంజారాల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను సోమవారం జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. - 9లో▸

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రణీత, డీఈవో

- మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు 'పది'పరీక్షలు
- రాష్ట్రస్థాయిలో టాప్ టెన్‌లో ఉంటాం..
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై స్పెషల్ ఫోకస్
- విద్యార్థులకు వేకప్ కాల్స్.. స్టడీ మెటీరియల్ అందజేత
- ఈ పరీక్షలకే ఇంటర్నల్.. వచ్చే ఏడాది నుంచి ఉండదు
- మార్కుల రూపంలో ఫలితాలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్‌: పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.. గత ఫలితాల కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో టాప్‌'టెన్‌'లో నిలుస్తాం.. ఇప్పటికే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.. చదువులో వెనుకబడిన వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టామని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు వేకప్ కాల్స్ చేసి చదివించేలా చొరవ చూపుతున్నారని, ఈ పరీక్షలకే ఇంటర్నల్ ఉంటాయని, వచ్చే ఏడాది నుంచి ఇంటర్నల్ మార్కులు ఉండవని ఆమె పేర్కొన్నారు. ఈసారి ఫలితాలు గ్రేడ్‌ల రూపంలో కాకుండా మార్కుల రూపంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. నిఘా నీడలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సీసీ కెమెరాల సమక్షంలో పేపర్ తెరడం, సీల్ వేయడం జరుగుతుందని, మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి ఆస్కారం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సాక్షి: విద్యార్థులను పరీక్షల కోసం ఎలా సిద్ధం చేస్తున్నారు?

డీఈవో: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళిక సిద్ధం చేశాం. రెండు నెలల నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి గ్రూపులుగా విభజించి చదువులు కొనసాగిస్తున్నాం. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి చదివించాలని సూచిస్తున్నారు. పరీక్షలు అయ్యేంత వరకు టీవీ, సెల్‌ఫోన్‌లు, శుభకార్యాలకు విద్యార్థులను దూరంగా ఉంచాలని పేర్కొంటున్నారు.

సాక్షి: ఈసారి మెరుగైన ఫలితాల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?

డీఈవో: గత విద్యా సంవత్సరంలో సాధించిన ఫలితాల కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. గతేడాది జిల్లాలో పదో తరగతి ఫలితాల పరంగా 92.93 శాతం ఉత్తీర్ణత సాధించగా రాష్ట్ర స్థాయిలో జిల్లా 17వ స్థానంలో నిలిచింది. ఈసారి ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేపట్టాం. జిల్లా కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. 'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులకు లాంగ్వేజ్ అభ్యాసన దీపికలను అందించేందుకు కృషి చేశారు. సెక్టోరియల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో కలిసి తాను సైతం పాఠశాలలను పరిశీలిస్తున్నారు.

సాక్షి: పరీక్షలతో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు మీరిచ్చే సలహా ఏమిటి?

డీఈవో: పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలి. పరీక్షలకు మరో 27 రోజుల సమయమే ఉంది. మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి ఆస్కారం ఉండదు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చు. పదో తరగతి పరీక్షలనేది విద్యార్థి భవిష్యత్‌కు తొలిమెట్టు. మంచి మార్కులు సాధిస్తేనే భవిష్యత్ బంగారు బాటగా ఉంటుంది. విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులు చూడాలి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఒకరోజు ముందు పరీక్ష కేంద్రాలను సందర్శించాలి.

సాక్షి: ఎంతమంది సిబ్బందితో పరీక్ష నిర్వహణ చేపడుతున్నారు?

డీఈవో: పరీక్ష నిర్వహణ కోసం 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 13 మంది కస్టోడియన్‌లు, 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ప్రశ్న పత్రాలను పోలీసు స్టేషన్‌లో భద్రపర్చడం జరుగుతుంది.

సాక్షి: ఈసారి ఎంతమంది విద్యార్థులు 'పది' పరీక్షలు రాయనున్నారు?

డీఈవో: మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. రెగ్యులర్ విద్యార్థులు 10,051 మంది, ప్రైవేట్ విద్యార్థులు 60 మంది మొత్తంగా 10,111 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీఈవో: పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీరు, వైద్యసేవలు, బెంచీలు ఏర్పాటు చేస్తాం. ఈసారి 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వడం జరుగుతుంది. అడిషనల్ పేపర్లు ఇవ్వడం జరగదు. బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 12 పేజీల బుక్‌లెట్ ఇస్తాం.

ఎమ్మెల్సీ గెలుపుతో సత్తా చాటాలి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కాంగ్రెస్‌ది అవినీతి, అసమర్థపాలన
- కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలను, పార్లమెంట్ ఎన్నికల్లో రెండోసారి ఎంపీని గెలిపించుకున్నామని, ఇదే స్ఫూర్తితో కష్టపడి పనిచేస్తూ ఎమ్మెల్సీలను సైతం గెలిపించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం తలమడుగు మండలంలోని ఉండం గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకులు, 25 ప్రభారీల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో కుటుంబ, అవినీతి, అహంకార పాలన సాగడంతో ప్రజలు కేసీఆర్‌ను గద్దెదించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండగా వాటిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. బీజేపీ పాలనకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని, ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే అర్హత సీఎంకు లేదన్నారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో బొగ్గు, 2జీ స్పెక్ట్రం, ఫార్ములా కారు రేసు, హెలిక్యాప్టర్ కొనుగోళ్లలో కుంభకోణాలు జరిగాయని, మోదీ 11ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ వచ్చిందా? అని సవాల్ విసిరారు. రైతు భరోసా, మహిళలకు రూ.2500 ఆర్థికసాయం, నిరుద్యోగ భృతి, వ్యవసాయ కూలీలకు ఆర్థికసాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం వంటి హామీలను అమలు చేయకుండా ఈ ప్రభుత్వం ఆయా వర్గాలను వంచిస్తోందని ధ్వజమెత్తారు. అన్నివర్గాల ప్రజలను మోసగించిన కాంగ్రెస్‌కు బీజేపీని విమర్శించే అర్హత లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న మార్పు రాలేదని , బీజేపీ అధికారంలోకి వస్తేనే ఆ మార్పు సాధ్యమన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీయేనన్నారు. ప్రతీ ఓటరును కలుస్తూ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీలుగా అంజిరెడ్డి, కొమురయ్యలను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్, రితేష్ రాథోడ్, శ్రీశైలం, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సోయంపై గోడం నగేష్ ఫైర్

సమావేశంలో మాట్లాడిన ఎంపీ గోడం నగేష్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు సోయం బాపూరావుపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. తాను ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఎలాంటి పెళ్లిళ్లు చేయలేదని, ఇళ్లు కట్టుకోలేదని ఎద్దేవా చేశారు. జిల్లాలో తొలిసారిగా కబడ్డీ సింథటిక్ కోర్టును తీసుకువచ్చింది బీజేపీ ప్రభుత్వమనే విషయాన్ని గుర్తించి విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ సాధించిన రైల్వే పనులను తాను సాధించినట్లుగా గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు.

పర్ధాన్ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి



పూజలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా హీరాసుక జయంతి వేడుకలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులదైవం, గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరాసుక దేవస్థానంలో కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కుమురం భీం, కుమురం సూరు విగ్రహాలకు పూలమాలలు వేశారు. అంతకుముందు ఆదివాసీ పర్ధాన్ కులస్తులు కలెక్టర్‌కు డోలువాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు అందించేలా నాయకులు, సంఘ పెద్దలు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, రిటైర్డ్ ఎస్పీ బాపురావు, రిటైర్డ్ తహసీల్దార్ కోవ మనోహర్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్, పీవీటీజీ ఏపీవో మనోహర్, కుడ్మెత సుభాష్, మడావి దిగంబర్, గెడం మాధవ్, కుడ్మెత ప్రకాష్, వెట్టి మనోజ్, వెట్టి దేవిదాస్, సిడాం రవి, మహిళా నాయకురాళ్లు ఆత్రం అనసూయ, గెడాం భారతీబాయి, గిరిజాబాయి, వనిత, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో పయనించాలి



రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రామన్న

ఆదిలాబాద్‌టౌన్‌: ప్రతిఒక్కరూ మహనీయులు చూపిన బాటలో పయనించి సమాజ నిర్మాణానికి పాటు పడాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌లో నిర్వహించిన సంత్ రవిదాస్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత వైపు ప్రజలను చైతన్యవంతులను చేయడంలో సంత్ రవిదాస్ కృషి చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. తాను గెలిచినా.. ఓడినా ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, తుదిశ్వాస వరకు ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, సంజయ్ గైక్వాడ్, సంతోష్ ఇంకరే, సంతోష్ గైక్వాడ్, దాదారావు, డాక్టర్ అల్కా సంజయ్, చంద్రప్రకాష్, మధు భవల్కర్, అశోక్ కాలే, డాక్టర్ రాజు, హేమంత్ పాల్గొన్నారు.

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కు జిల్లావాసి



విద్యాసాగర్

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టల్‌వాడ కాలనీకి చెందిన డాక్టర్ దేవతడే విద్యాసాగర్‌కు అత్యుత్తమమైన లండన్‌లోని ఇంపీరియల్ కాలేజ్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేసే అవకాశం దక్కింది. 96 శాతం స్కోరుతో ప్రతిష్టాత్మక మేరిక్యూరీ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు. దేవతాడే ఘనశ్యాం–శశికళ దంపతుల చిన్న కుమారుడైన విద్యాసాగర్ జిల్లా కేంద్రంలోని విద్యార్థి జూనియర్ కళాశాలలో ఇంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ సమయంలో గురువు సూర్యప్రకాశ్‌తో ప్రేరణ పొంది ఆయన మార్గదర్శకంతో హైదరాబాద్ యూనివర్సిటీలో సీటు సాధించి కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం నాగ్‌పూర్‌లోని విశ్వేశ్వరయ్య జాతీయ సాంకేతిక సంస్థ (వీఎన్ఐటీ)లో మెటీరియల్ కెమెస్ట్రీలో పీహెచ్‌డీ చేసి ప్రతిభ కనబర్చాడు. లండన్ కేంబ్రిడ్జ్‌లో పరిశోధనలు చేసే అవకాశం దక్కించుకోవడంతో గురువులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.

మన్‌కీ బాత్‌లో ఆదివాసీ టీచర్ ప్రస్తావన

కైలాస్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ గిరిజన టీచర్ కృషిని ప్రస్తావించారు. ఢిల్లీలో జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని తాను ఇటీవల కృత్రిమ మేధ సదస్సులో పాల్గొనేందుకు పారిస్ వెళ్లానని, ఏఐలో భారత్ సాధించిన విజయాలను ప్రపంచం ప్రశంసించిందని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఆదివాసీ ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ గిరిజన భాషలను కాపాడటంలో తమకు సాయం చేశారని గుర్తు చేశారు. ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో కైలాస్ పాటను కంపోజ్ చేసి అద్భుతాన్ని సృష్టించారని ప్రశంసించారు. సోషల్ మీడియాలో సదరు ఉపాధ్యాయుడు చేసిన పోస్టులు ఆదివాసీలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయని అభినందించారు.

స్వచ్ఛందంగా కుల గణన

- ఇప్పటి వరకు 41 కుటుంబాల వివరాలు అందజేత



వివరాలు నమోదు చేస్తున్న బల్దియా ఉద్యోగులు

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాలను నమోదు చేసుకోని వారికోసం మరో అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఈ నెల 16 నుంచి 28 వరకు ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా అధికారులను సంప్రదించి తమ వివరాలను అందజేయవచ్చని సూచించింది. ఇందుకు ఆదిలాబాద్ పట్టణ ప్రజలు స్పందిస్తున్నారు. ఎన్యూమరేటర్లుగా వచ్చిన సమయంలో తమ వివరాలను ఇవ్వనివారు టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమిస్తున్నారు. దీంతో బల్దియా సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఆ కుటుంబాల సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. మరికొంత మంది స్వచ్ఛందంగా సమగ్ర కుటుంబ సర్వే ఫారాలను పూర్తిచేసి బల్దియా కార్యాలయంలో నేరుగా అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 41 కుటుంబాల సమాచారం కొత్తగా అధికారులకు అందింది. ఇందులో టోల్ ఫ్రీ ద్వారా 22 కుటుంబాలు సమాచారాన్ని అందజేయగా మ్యాన్‌వల్‌గా మరో 19 మంది దరఖాస్తులను నింపి అధికారులకు అందజేశారు. వాటిని స్వీకరించిన బల్దియా అధికారులు ఆ వివరాలను ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఇంకా ఎవరైన మిగిలి ఉన్నట్లైతే ఈ నెల 28లోగా తమ సమాచారాన్ని అందజేయాలని మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో వందశాతం సర్వేను పూర్తి చేశామని అధికారులు చెబుతుండగా ఇలా దరఖాస్తులు రావడం వారి పనితీరుకు అద్దం పడుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'సాలెగూడ'కు నీటికష్టాలు

ఇంద్రవెల్లి: మండలంలోని సాలెగూడ గ్రామస్తులకు నీటికష్టాలు తప్పడంలేదు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పాటు ఉన్న మంచినీటి పథకాలు కూడా పనిచేయడంలేదు. దీంతో గ్రామస్తులు ఆదివారం ఎడ్లబండ్లను కట్టుకుని గ్రామానికి దూరంలో ఉన్న బోరు బావి వద్ద గంటల తరబడి వేచి ఉండి నీటిని తీసుకెళ్తూ కనిపించారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే దృష్టి సారించి తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



బోరుబావి వద్ద ఎడ్లబండ్లతో సాలెగూడ గ్రామస్తులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

నర్సాపూర్ (జి): మండల కేంద్రం శివారు 61వ జాతీయ రహదారిపై బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన జంగ్మె సంతోష్, గౌతమ్ బైక్‌పై నిర్మల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా నర్సాపూర్ (జి) గ్రామ శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంతోష్ ఆదివారం ఉదయం మరణించాడు. గౌతమ్ చికిత్స పొందుతున్నాడు. సంతోష్ అన్న కాశీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మందమర్రిలో బైక్ అదుపుతప్పి..

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన షేక్ ముగ్దుం, షేక్ జిలానీ అన్నదమ్ములు. ఏరియాలోని కేకే ఓసీలో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఆదివారం పని నిమిత్తం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి.. తిరిగి బెల్లంపల్లిలోని వాళ్ల మేనమామ ఇంటికి బయల్దేరారు. బైక్ అదుపుతప్పి కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొన్నారు. బైక్ నడుపుతున్న జిలానీ(30) అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్దుం తీవ్రగా గాయపడ్డాడు. అతడిని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..


సంతోష్ (ఫైల్)

కుభీర్: మండల కేంద్రానికి చెందిన సిందే సంతోష్ (30) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న సంతోష్ తన అత్తగారి ఊరైన భైంసా మండలం సిద్దూరుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి సాయంత్రం వస్తుండగా సిద్దూరు దాటగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో కిందపడ్డాడు. తల పగిలి తీవ్ర రక్తస్రావం కాగా, వెంటనే కుటుంబీకులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం హైదారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడున్నారు.

నాటు కోళ్లు మృత్యువాత

భీమారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో పెంచుతున్న 50 నాటు కోళ్లు అంతు చిక్కని వ్యాధితో మృతి చెందాయి. కాలనీలో సాయికుమార్ స్వయం ఉపాధి కోసం తెచ్చి పెంచుతున్న 20 కోళ్లు ఆదివారం మృతి చెందగా, అంతకుముందు మరో 30 మరణించాయని తెలిపారు. ఇవే కాకుండా చాలా మంది ఇళ్లలో పెంచుతున్న కోళ్లు కూడా మరణిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

ప్రాచీన కళకు ప్రాణం

- చిరుతల రామాయణం సాధనలో గ్రామీణులు
- నిష్టతో నేర్చుకుంటున్న కాచన్‌పల్లి కళాకారులు
- ప్రదర్శనతో భావితరాలకు మన సంస్కృతి


కాచన్‌పల్లిలో చిరుతల రామాయణం సాధన చేస్తున్న కళాకారులు


చిరుతల రామాయణంలో ఓ సన్నివేశం(ఫైల్)

చెన్నూర్‌రూరల్: టీవీలు వచ్చాక.. ప్రాచీన కళలకు ఆదరణ తగ్గింది. సెల్‌ఫోన్ ఆవిష్కరణ చూసేవారు తగ్గిపోయారు.. అన్‌డ్రాయిడ్ ఫోన్ అరచేతిలోకి వచ్చాక పరిస్థితి మరింత దిగజారింది. కళలను చూసేవారే కాదు.. కళలను పోషించేవారు తగ్గిపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల కళాకారులు చిరుతల రామాయం రక్షణకు శ్రీకారం చుట్టారు. రామాయణంలోని వివిధ పాత్రలు పోసించేందుకు శిక్షణ పొందుతున్నారు. తర్వాత ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం కాచన్‌పల్లి వాసులు నెల రోజులుగా నిష్టతో సాధన చేస్తున్నారు.

నిష్టగా ఉంటేనే..

పల్లె కళాకారులకు గురువు చిరుతల రామాయణంలో సన్ని వేశాలు, మాటలు, పద్యాలలో శిక్షణ ఇస్తారు. ఇందులో అన్ని ప్రాతలు చేసేందుకుగాను సుమారు 25 మంది కళాకారులు శిక్షణ పొందుతారు. రామాయణంలో సన్నివేశాలు నేర్చుకునే సమయంలో నియమ, నిష్టలతో ఉంటారు. సుమారు నెల నుంచి రెండు నెలలు సాధన చేస్తారు. ఆ సమయంలో మద్యం, మాంసం ముట్టరు. తర్వాత ఎంపిక చేసిన గ్రామాల్లో చిరుతల రామాయణం ప్రదర్శిస్తారు.

సాధన, ప్రదర్శన రాత్రివేళలోనే..

ఇక చిరుతల రామాయణం సాధన, ప్రదర్శన రెండూ రాత్రి వేళలలోనే ఉంటాయి. ఉదయం రోజువారీ పనులకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు రాత్రి సమయాన్నే ఎంచుకుంటున్నారు. సాధన చేసేవారిలో రైతులు, కూలీలు, ప్రజాప్రతినిధులు కూడా ఉంటున్నారు.

వారం రోజులు ప్రదర్శన..

చిరుతల రామాయణం ప్రతీ గ్రామంలో వారం రోజులు ప్రదర్శిస్తారు. ఇందులో ఆరు ఘట్టాలు ఉంటాయి. మొదటగా అయోధ్యకాండ, బాలకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ ఉంటాయి. రోజుకు ఒక కాండ చొప్పున ప్రదర్శిస్తుంటారు. బాల రాముడి నుంచి పట్టాభిషేకం వరకు ప్రదర్శన ఇస్తారు. ఈ ప్రదర్శనకు సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కళాకారులు ఒక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేసుకుంటారు. అలాగే గ్రామంలోని వారు ఇంటికి కొంత డబ్బులు చందా జమ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో చిరుతల రామాయణ ప్రదర్శన కొనసాగుతాయి.

రాముని పాత్ర పోషించడం అదృష్టం



నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణం ప్రదర్శనలో రాముని పాత్ర కనిపించబోతున్నాను. రాముని పాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతీరోజు రాత్రి ప్రాక్టీస్ చేస్తున్నాం.

–నరిగె రాజబాపు, కాచన్‌పల్లి, కళాకారుడు

లక్ష్మణుని పాత్ర చేస్తున్నాను



ఎంతో నియమ, నిష్టలతో ఉండి చిరుతల రామాయణం నేర్చుకుని ప్రదర్శిస్తాం. నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణం ప్రదర్శనలో లక్ష్మణుని పాత్ర చేస్తున్నాను. ప్రతీరోజు రాత్రి సమయంలో ప్రాక్టీస్ చేస్తున్నాం.

– తిరుపతి, కాచన్‌పల్లి, కళాకారుడు

ఆంజనేయుని వేషధారణ



ప్రతీరోజు రాత్రి సమయంలో ప్రాక్టీస్ చేస్తున్నాం. ఆంజనేయుడి పాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నా. ఎంతో నియమ, నిష్టలతో ఉండి చిరుతల రామాయణం నేర్చుకుంటున్నాం.

– లింగయ్య, కాచన్‌పల్లి, కళాకారుడు

మూడుసార్లు శిక్షణ ఇచ్చా..



చిరుతల రామాయణం అంటే ప్రాచీన కళ, సనాతన ధర్మాన్ని కాపాడేది. నేను మా పెద్దల వద్ద నేర్చుకున్నాను. పాత్రలు కూడా పోషించాను. ఇప్పటి వరకు నేను చిరుతల రామయణంపై మూడుసార్లు శిక్షణ ఇచ్చాను. మా గ్రామంలో మార్చి 25 నుంచి చిరుతల రామాయణం ప్రదర్శన ఉంది.

– గోదరి రాజయ్య, శిక్షకుడు, కాచన్‌పల్లి

విభీషణుని పాత్ర..



నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణంలో విభీషణుని పాత్ర పోషించబోతున్నాను. 20 రోజుల నుంచి శిక్షణ పొందుతున్నాం. వచ్చే నెలలో ప్రదర్శన ఉంటుంది.

–నరిగె లింగయ్య, కాచన్‌పల్లి, కళాకారుడు, మాజీ సర్పంచ్

బాసరలో భక్తుల రద్దీ


క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో చిన్నారులకు అర్చకులతో అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లనూ దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు ఆలయాధికారులు తెలిపారు.

అమ్మవారి ఒక్కరోజు ఆదాయం

ఆదివారం మాఘమాసం శుభముహూర్తం కావడంతో సరస్వతీ అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకోగా వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.15.46లక్షల ఆదాయం సమకూరింది. రూ.500 అభిషేకాల ద్వారా రూ.70,500, రూ.వెయ్యి అక్షరాభ్యాస టికెట్ల ద్వారా రూ.7.76లక్షలు, రూ.150 అక్షరాభ్యాసాల ద్వారా రూ.46,500, రూ.100 మండప ప్రవేశం ద్వారా రూ.85వేలు, రూ.50 మండప ప్రవేశం ద్వారా రూ.12వేలు, అభిషేకం లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2.94లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.2.62లక్షలు ఆదాయం వచ్చింది.

సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రికి వినతి


వినతిపత్రం ఇస్తున్న 'సమగ్ర' ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమక్షంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. పేస్కేల్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే చర్యలు చేపడతామని పేర్కొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పడాల రవీందర్, ప్రియాంక, కవిత, దేవదర్శన్, అర్చన, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి పేస్కేల్ ఇప్పించే విధంగా చూడాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ కల్పించాలని, వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, ఉద్యోగి సర్వీసులో మరణిస్తే కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, మహిళలకు ప్రసూతి సమయంలో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బండ శ్రీనివాస్, రవి, రాజు, సంతోష్, జ్ఞానేందర్, శైలేందర్, రవికిరణ్ యాదవ్, ఫేరోజ్, తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్


చైర్మన్‌ను గజమాలతో సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు, సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అటవీశాఖ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. టీఎన్జీవోస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ ఫారెస్ట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, కాళేశ్వరం జోనల్ సెక్రటరీ సుభాష్, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్, కవ్వాల్ సర్కిల్ రెప్రజెంటేటీవ్ అజర్, అటవీ శాఖ ఉద్యోగ నాయకులు ఆయనను గజమాలతో సత్కరించారు. సిరిసిల్ల పద్మశాలి నేతలతో నేసిన అగ్గిపెట్టెలో పట్టే పట్టు వస్త్రాలను బహూకరించారు. అనంతరం అటవీ శాఖలో ఖాళీగా ఉన్న ఎఫ్‌బీవో పోస్టులను భర్తీ చేయాలని, పోలీస్ శాఖలో వర్తిస్తున్న జీతభత్యాలు అటవీ శాఖలోని యూనిఫాం ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని, పదన్నతులు కల్పించాలని, ఫారెస్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. స్పందించిన మారం జగదీశ్వర్ జూనియర్ అటవీ ఉద్యోగుల సమస్యలతోపాటు అందరి సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, టీఎన్జీవోస్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాటరీ లైట్లతో వన్యప్రాణుల వేట


పట్టుకున్న నిందితుడితో ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి: బ్యాటరీ లైట్ల సహాయంతో వన్యప్రాణులను వేటాడుతున్న ఒకరిని నీల్వాయి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల ప్రకారం.. కళ్లంపేట గ్రామానికి చెందిన తోకల జీవన్ కొంత మందితో కలిసి కోటపల్లి మండలం నక్కలపల్లి, చామనపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడుతున్నారు. బ్యాటరీ చార్జింగ్ పెట్టి లైట్లు దానికి అనుసంధానం చేసి అటవీ ప్రాంతంలో రాత్రిపూట వన్యప్రాణులను లైట్ వెలుతురు సహాయంతో ట్రాక్ చేసి చంపేస్తున్నారు. పక్కా సమాచారంతో నీల్వాయి ఎస్సై ఆదివారం తెల్లవారుజామున నీల్వాయి బస్టాండ్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న జీవన్‌ను పట్టుకున్నాడు. అతడిని తనిఖీ చేయగా అడవి పిల్లి, కుందేలు, జింక కాళ్లు, తల, మాంసం లభ్యమయ్యాయి. బ్యాటరీలు చార్జింగ్ లైట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని నీల్వాయి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వేటాడినవారిలో జీవన్‌తోపాటు కళ్లంపేట గ్రామానికి చెందిన ఉంద్రాళ్ల పోశం, ఇంకా కొంత మంది ఉన్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కెట్టిపేట గ్రామానికి చెందిన ఉప్పు నర్సయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలానికి వెళ్లారు. విద్యుదాఘాతంతో ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న బంగారం, నగదు, నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి, వ్యవసాయ పనిముట్లు కాలిపోయాయి. రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉట్నూర్‌రూరల్: బాధిత కుటుంబాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తనవంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు ఖయ్యుం, దాసండ్ల ప్రభాకార్, తదితరులు ఉన్నారు.

అ'పూర్వ'ం.. ఆత్మీయం


నస్పూర్ పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సీసీసీలోని బొమ్మరిల్లు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు జక్కుల మల్లేశ్, తొట్ల బుచ్చన్న, కారుకూరి రవీందర్, శ్రీనివాస్ శర్మ, ధనలక్ష్మి, రమాదేవి, రేఖాఠాగూర్, సుజాత తదితరులు పాల్గొన్నారు. – నస్పూర్

బాలిక తండ్రిపై బాలుడి హత్యాయత్నం

- ప్రేమపెళ్లికి నిరాకరించాడని ఘాతుకం
- చికిత్స పొందుతున్న బాలిక తండ్రి
- వివరాలు వెల్లడించిన నిర్మల్ ఏఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌టౌన్: తాను ప్రేమించిన బాలికతో పెళ్లికి నిరాకరించిన ఆమె తండ్రిపై పగ పెంచుకున్న ఓ బాలుడు అతడిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బాలుడు జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ కార్యాలయం వద్ద గల డబుల్ బెడ్రూం ఇంటిలో నివసించే ఓ బాలికను ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని ఆమెతో చెప్పగా పెళ్లీడు వచ్చేదాకా ఆగాలని ఆ బాలిక బదులిచ్చింది. దీంతో ఆ బాలుడు నేరుగా బాలిక తండ్రి అబ్దుల్ అజీజ్ వద్దకే వెళ్లి 'మీ కూతురును ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటాను' అని చెప్పాడు. బాలిక తండ్రి కూడా పెండ్లీడు వచ్చాకే పెళ్లి చేస్తానని చెప్పాడు. ఈ విషయం నచ్చని బాలుడు అజీజ్‌పై కోపం పెంచుకున్నాడు. ఎలాగైనా అతడిని చంపాలని పథకం పన్నాడు. మొహమ్మద్ తౌసిఫ్ ఉల్ల సహకారం తీసుకుని ఈనెల 22న రాత్రి 10.45గంటలకు సదరు బాలిక ఇంటికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న కత్తెరతో బాలిక తండ్రి కడుపులో పొడిచాడు. ఈ ఘటన నుంచి తప్పించుకున్న అబ్దుల్ అజీజ్‌ను స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు హత్యాయత్నానికి కారకులైన బాలుడితోపాటు సహకరించిన మొహమ్మద్ తౌసిఫ్‌ను పోలీసులు 24 గంటల్లో చాకచక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

ఇంద్రవెల్లి: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని దుర్గనగర్‌కు చెందిన సుక్‌దేవ్ అలియాస్ సన్ని (25), రాన్‌మలే గజానంద్ అలియాస్ కిరణ్ (21), టెంబుల్‌కర్ కృష్ణ (20), బక్కలే ఆకాశ్ (19) ఈ నెల 21న ఇంద్రవెల్లి మండలంలోని ఈశ్వర్‌నగర్ జై దుర్గవైన్స్‌తో పాటు ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న రెండు వైన్‌షాపుల్లో, నార్నూర్ మండలంలోని రెండు కిరాణ షాపుల్లో, గాదిగూడ మండలంలోని లోకరి వైన్‌షాపులో చోరీకి పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ఆదివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు వెళ్తున్న నలుగురు యువకులను పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద ద్విచక్రవాహనంతో పాటు రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. గతంలో తలమడుగు మండల కేంద్రంలోని కిరాణ షాపుతో పాటు జగిత్యాలలో కూడా దొంగతనం చేసినట్లు తెలిపారు. ఆదివారం కూడా దొంగతనం చేయడానికి ముందస్తు రెక్కీ కోసం ఉట్నూర్ వైపు వెళ్తుండగా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు సాయి కిరణ్, హరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన హంపోలి ప్రభాకర్‌రెడ్డి (42) మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్‌రెడ్డి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెంది శనివారం రాత్రి తన పంట పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి..

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ– వేంపల్లి గ్రామాల మధ్య అటవీప్రాంతంలో గల భీమన్న ఆలయ సమీపంలో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మబస్తీ కాలనీకి చెందిన మామిడి వెంకటేశ్(35) ఆలయ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని ఎస్సై తెలిపారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వివాహిత ప్రేమాయణం

- న్యూడ్ కాల్ చేయాలని బ్లాక్‌మెయిల్ చేసిన నిందితుడు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో యువత కొత్త పుంతలు తొక్కుతోంది. కొంతమంది మితిమీరిన పరిచయాలు పెంచుకుని ప్రేమాయణంతో పాటు అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నారు.. ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ వివాహితకు ఈస్ట్ గోదావరి జిల్లా రాజోల్ మండలం మొర్కపాలెంకు చెందిన బీఫార్మసీ విద్యార్థి నందుల ఆనంద్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అప్పుడప్పుడు వీడియో కాల్‌చేసి మాట్లాడుకునేవారు. అయితే నిందితుడు వీడియో కాల్ చేసే సమయంలో స్క్రీన్‌షార్ట్ తీసుకునేవాడు. న్యూడ్ కాల్ చేయకపోతే వాటిని సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఆమె భయపడి న్యూడ్ కాల్ చేయడంతో వాటిని స్క్రీన్‌షార్ట్ తీసుకొని తనవద్ద ఉంచుకున్నాడు. శారీరకంగా తనను కలవాలని, లేనట్లయితే సోషల్ మీడియాలో వాటిని పోస్టు చేస్తానని భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో సదరు మహిళ ఈనెల 4న వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు నిందితుడిని ఆమె ద్వారా అక్కడి నుంచి పిలిపించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. రెండు నెలల క్రితం ఆదిలాబాద్‌కు చెందిన ఓ మైనర్ విద్యార్థినికి హైదరాబాద్‌కు చెందిన యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. తర్వాత ఇంట్లో ఎవరికి చెప్పకుండా అతనితో వెళ్లిపోయింది. పోలీసులు ట్రాప్ చేసి పట్టుకొని నిందితుడిని కటకటాల పాలు చేశారు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని ప్రేమ పేరిట యువత తప్పుదోవ పడుతున్నారని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.